

టన్ను చీనీ రూ.40 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.40 వేలు పలికాయి. మార్కెట్‌కు 597 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



నడిపించే దైవం నాన్న

అమ్మ ఊపిరిపోస్తే నాన్న చేయిపట్టి నడిపిస్తాడు. మార్గదర్శిగా మారి మన ఉన్నతికి సర్వమూ ధారపోస్తాడు. అలాంటి ఎందరో నాన్నలకు సెల్యూట్.

8లో

గరిష్టం/కనిష్టం
37.4°/22.1°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

'గురుకుల' మిగులు సీట్లకు 20న ప్రవేశ పరీక్ష



లేపాక్షి: మహాత్మా జ్యోతిబాఫూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 20న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికలకు టేకులోడు, గుడిబండ, బుక్కపట్నం , నసనకోట, బాలురకు లేపాక్షి, రొద్దం-1, రొద్దం-2, గుండుమల, పేరూరు, రేగాటిపల్లి పాఠశాల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థి ఏ పాఠశాలలో చేరేందుకు దరఖాస్తు చేశారో...అదే పాఠశాలలో 20వ తేదీ ఉదయం 11 గంటలకు పరీక్ష ఉంటుందన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. 6, 7 తరగతులకు రాత పరీక్ష తెలుగులో 10 మార్కులు, ఇంగ్లిష్ 10, గణితం 15, ఎన్విరాన్మెంటల్ స్టడీస్‌లో 15 మార్కులకు ఉంటుందని వివరించారు. 8, 9 తరగతులకు తెలుగులో 5 మార్కులకు, ఇంగ్లిష్ 10, గణితం 15, సైన్సు 10, సోషల్, జనరల్ నాలెడ్జ్ కలిపి 10 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుందని తెలిపారు. ప్రతిభ ఆధారంగా అర్హత సాధించిన విద్యార్థులను ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

ఎకాలజీ సెంటరుకు జలశక్తి అవార్డు



కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ నుంచి అవార్డు తీసుకుంటున్న వైవీ మల్లారెడ్డి

అనంతపురం: కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ అనంతపురంలోని యాక్షన్ ఫెటర్నా ఎకాలజీ సెంటరుకు 4వ జాతీయ జల అవార్డును ప్రకటించింది. జల వనరుల అభివృద్ధి, నిర్వహణకు విశేష కృషి చేస్తున్న సంస్థలకు వివిధ కేటగిరీల కింద నేషనల్ వాటర్ అవార్డులు ప్రదానం చేస్తున్నారు. ఈక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో జల వనరుల అభివృద్ధి, మెట్ట వ్యవసాయంలో కరువు నుంచి రక్షించడానికి ఫారం పాండ్లు, రక్షక తడి, మిశ్రమ పంటలు, అంతర పంటలు మొదలైనవి విస్తృతంగా అమలు చేస్తూ విశేష కృషి చేసినందుకు యాక్షన్ ఫెటర్నాకు ప్రత్యేక అవార్డు ప్రకటించారు. శనివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చేతుల మీదుగా ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వైవీ మల్లారెడ్డి మాట్లాడుతూ ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ పనితీరు, రైతులకు జరుగుతున్న మేలును గుర్తించి, కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయి అవార్డు అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ విజయం సంస్థ సిబ్బంది, రైతుల ఉమ్మడి కృషితో సాధ్యమైందన్నారు. అవార్డు స్ఫూర్తితో ఉమ్మడి జిల్లా రైతులకు మేలు జరిగేలా మరింత మెరుగ్గా పనిచేస్తామన్నారు.

ప్రతి విద్యార్థీ ఉన్నతంగా చదవాలి





పదో తరగతి టాపర్ రొళ్ల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి ఐశ్వర్యకు, ఇంటర్‌లో జిల్లా టాపర్ షాజియాకు చెక్కు, పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి, కలెక్టర్ అరుణ్ బాబు తదితరులు

- సీఎం వైఎస్ జగన్ లక్ష్యం ఇదే
- అందుకే విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు
- ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి, కలెక్టర్ అరుణ్‌బాబు
- పది, ఇంటర్‌లో మెరుగైన ర్యాంకులు సాధించిన 53 మందికి ప్రోత్సాహకాలు

ప్రశాంతి నిలయం: ''చదువుకోవాలన్న ఆశ ఉంటే చాలు అన్నీ ప్రభుత్వమే సమకూరుస్తుంది. రాష్ట్రంలో ఇప్పుడు చదువుల పండుగ నడుస్తోంది. రూపాయి ఖర్చు లేకుండానే సీఎం జగనే అందరినీ చదివిస్తున్నారు. 'నాడు- నేడు'తో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారు. ఆర్థిక ఇబ్బందులతో ఏ ఒక్క విద్యార్థీ చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో వివిధ పథకాలు అమలు చేస్తున్నారు. అంతిమంగా ప్రతి విద్యార్థీ ఉన్నతంగా చదువుకోవాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు'' అని మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి అన్నారు. శనివారం పుట్టపర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పది, ఇంటర్ ఫలితాల్లో జిల్లా టాపర్లుగా నిలిచిన 53 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఎమ్మెల్యే, కలెక్టర్ సన్మానించారు. అనంతరం ఇన్‌చార్జ్ డీఈఓ రంగస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేయడం ద్వారా పేదలకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. పేదలకు పిల్లల చదువులు భారం కాకుడదన్న ఉద్దేశంతో 'జగనన్న అమ్మ ఒడి' పథకం ద్వారా ఏటా రూ.15 వేలు తల్లిఖాతాకు జమ చేస్తున్నారని, 'నాడు-నేడు' ద్వారా పాఠశాలల్లో సౌకర్యాలను మెరుగుపర్చారని, విద్యాకానుక ద్వారా విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందిస్తున్నారన్నారు. తల్లిదండ్రుల కంటే జగనన్నే ఎక్కువ బాధ్యత తీసుకుని విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మెరుగైన మార్కులు సాధించిన విద్యార్థులకు, వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులకు, చక్కటి పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

స్ఫూర్తినిచ్చేందుకే 'ఆణిముత్యాలు'..

కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లోని ఇతర విద్యార్థులకు స్ఫూర్తి కలిగించేలా ఇంటర్, పదో తరగతుల్లో జిల్లా టాపర్లుగా నిలిచిన వారికి 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం ద్వారా సన్మానాలు చేస్తున్నామన్నారు. గతంతో పోల్చుకుంటే ఈ నాలుగేళ్లలో సర్కార్ బడులు ఎంతో మారాయన్నారు. మౌలిక వసతులు మెరుగుపడటంతో పాటు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఫలితాలు వస్తున్నాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం పాఠశాలల్లో ప్రవేశాలకు డిమాండ్ పెరిగిందన్నారు. ఇంటర్, పది ఫలితాల్లో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ర్యాంకులు సాధించారని, ఇందుకు కారణమైన ప్రతి ఉపాధ్యాయుడికీ అభినందనలు తెలుపుతున్నానన్నారు. ఇదే స్ఫూర్తితో 2023-24 విద్యా సంవత్సరంలోనూ ఉపాధ్యాయులు మరింత కష్టపడి మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు.

చెక్కుల అందజేత..

పదో తరగతిలో ఫలితాల్లో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంక్‌లు సాధించిన 29 మంది విద్యార్థులకు, ఇంటర్‌కు సంబంధించి 24 మంది విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, మెడల్స్‌తోపాటు నగదు బహుమతికి సంబంధించిన చెక్‌ను అందజేశారు. ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ. 50 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 30 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.15 వేల చొప్పున చెక్కును అందజేశారు. వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులనూ శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అవుటాల రమణారెడ్డి, 'పుడా' చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, పుట్టపర్తి ఎంపీపీ రమణారెడ్డి, పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ ఓబులపతి, ఆర్డీఓ భాగ్యరేఖ, డీవైఈఓ రఘునాథరెడ్డి, వార్డు కౌన్సిలర్ చెరువు భాస్కర్‌రెడ్డి, విద్యాశాఖ ఏడీ నాగరాజు, ఎంఈఓ వెంకటరమణ, పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇద్దరు తహసీల్దార్లకు పోస్టింగ్

అనంతపురం అర్బన్: తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతి పొందిన ఇద్దరికి కలెక్టర్ గౌతమి శనివారం మండలాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ముగ్గురు డీటీలు తహసీల్దార్లుగా పదోన్నతి పొందారు. వీరిలో ఎస్.సైపుల్ హక్ డీటీగానే వీఆర్ఎస్ తీసుకున్నారు. ఇక డి.ఓబుళేసును బెలుగుప్ప తహసీల్దారుగా, పి.శేషారెడ్డిని కూడేరు తహసీల్దారుగా నియమించారు. ఇదిలా ఉండగా శ్రీసత్యసాయి జిల్లా నుంచి తహసీల్దారు బాలాజీరావు పరస్పర బదిలీపై అనంతపురం వస్తున్నారు. ఇక్కడి నుంచి తహసీల్దారు వేణుగోపాల్‌రావు అక్కడికి వెళ్లుతున్నారు. కలెక్టర్ వద్ద బాలాజీరావు రిపోర్టు చేసుకున్న తరువాత పోస్టింగ్ ఇస్తారు.

చిన్నారిని మింగిన నీటితొట్టె



మృతి చెందిన మధుమిత

మడకశిర రూరల్: తల్లిదండ్రులు పనుల్లో నిమగ్నమై ఉండగా, ఆడుకుంటూ నీటతొట్టె వద్దకు వెళ్లిన ఏడాదిన్నర వయసున్న చిన్నారి అందులో మునిగి మృత్యువాత పడింది. ఈ సంఘటన శనివారం మడకశిర మండల పరిధిలోని వైబీ హళ్ళి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... వైబీ హళ్లి గ్రామానికి చెందిన రైతు బాలకృష్ణారెడ్డి తన పొలంలో కోళ్ల ఫాం నిర్వహిస్తున్నాడు. ఇందులో పశ్చిమ బెంగాల్‌కు చెందిన మనోజ్‌మన్నా, దేబిభార్కిమన్నా దంపతులు మూడేళ్లుగా పనిచేస్తూ పొలంలోనే షెడ్డు వేసుకుని ఉంటున్నారు. వారికి మధుమిత (18 నెలలు) సంతానం. శనివారం ఉదయం దంపతులు కోళ్ల ఫాం వద్ద పనిచేసుకుంటూ ఉండగా, చిన్నారి మధుమిత ఆడుకుంటూ సమీపంలో ఏర్పాటు చేసిన నీటి తొట్టె వద్దకు వెళ్లింది. అనంతరం నీటితో ఆడుకుంటూ కాలుజారి అందులో పడిపోయింది. గమనించిన మనోజ్‌మన్నా వెంటనే చిన్నారిని మడకశిర ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అమరాపురం పోలీసులు తెలిపారు.

మెరుగైన 'ఉపాధి'



పరిగి మండలం ఊటుకూరులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

- ఉపాధి కూలీలకు సర్కారు భరోసా
- వంద రోజుల పని కల్పిస్తోన్న ప్రభుత్వం
- సకాలంలో కూలి డబ్బుల చెల్లింపులు
- లక్ష్యం చేరుకునేందుకు అధికారుల కసరత్తు

సాక్షి, పుట్టపర్తి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల భవితకు భరోసా ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తుండగా ఎందరికో మేలు జరుగుతోంది. జిల్లా అధికారులు కూడా చక్కని ప్రణాళికతో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు నిబంధనల మేరకు 100 రోజులు పని కల్పిస్తున్నారు. అలాగే వారం వారం కూలీల ఖాతాల్లోకి ఉపాధి డబ్బులు జమ అయ్యేలా చూస్తున్నారు. ఫలితంగా పల్లెవాసులకు చేతినిండా పని ఉంటోంది. వలసలు వెళ్లకుండా స్థానికంగా ఉపాధి లభిస్తోందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు అండగా..

ప్రస్తుతం జిల్లాలో 2.75 లక్షల కుటుంబాలకు జాబ్ కార్డులున్నాయి. అందులో ఎస్సీ వర్గానికి 44,790 ఉండగా.. ఎస్టీ వర్గానికి 15,567 జాబ్ కార్డులు ఉన్నాయి. జాబ్ కార్డుదారులందరికీ 100 రోజులు పని కల్పించడంలో అధికారులు పక్కా ప్రణాళిక సిద్ధం చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీలకు 5,15,373 పనిదినాలు, ఎస్టీ వర్గాలకు 2,20,007 పనిదినాలు కల్పించారు. దీంతో ఆయా వర్గాల్లోని వారికి ఉపాధి హామీ పథకం కుటుంబ పోషణకు చక్కటి మార్గంలా మారింది.

గత ప్రభుత్వానికి భిన్నంగా..

టీడీపీ హయాంలో రెండు నెలలకు ఓసారి ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించేవారు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక వారం పూర్తి కాకముందే కూలి డబ్బులు జమ చేస్తున్నారు. అంతేకాకుండా ఒక్కొక్కరికి రోజుకు సగటున రూ.270 పైగా కూలి అందుతోంది.

ఆరు గంటలకే ఉపాధి పనులకు..



ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఉదయం ఆరు గంటలకే ఉపాధి హామీ పనులకు వెళ్లి 9:30 గంటలకు ఇంటికి చేరుకుంటున్నాం. వారం వారం కూలి డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నారు.

– శివలింగమ్మ, సి.కొడిగేపల్లి, మడకశిర

చకాచకా చెల్లింపులు



గ్రామస్థాయిలోనే కూలీలకు ఉపయోగపడే పనులు కల్పిస్తుండడంతో రోజు ఉదయం పనులకు వెళుతున్నాం. కూలి పెంచడం ఎంతో మేలు జరుగుతోంది. కూలి డబ్బు కూడా సకాలంలో జమ అవుతోంది.

– లింగమ్మ, సి.కొడిగేపల్లి, మడకశిర మండలం

వంద రోజుల పని కల్పిస్తున్నాం



ఉపాధి హామీ ద్వారా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు వంద రోజులకు తగ్గకుండా పనులు కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు జాబ్‌కార్డుదారులకు వంద రోజుల పాటు పని కల్పిస్తున్నాం. సకాలంలో కూలి డబ్బులు అందజేస్తున్నాం.

– రామాంజనేయులు, పీడీ, డ్వామా

'జగనన్న సురక్ష'కు సమగ్ర ప్రణాళిక

- కలెక్టర్ అరుణ్‌బాబు



వీసీలో పాల్గొన్న కలెక్టర్, డీఆర్‌ఓ, అధికారులు

పుట్టపర్తి అర్బన్: ప్రజల ఇంటి వద్దకే వెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు జూలై 1 నుంచి 31వతేదీ వరకూ జిల్లాలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. శనివారం రాష్ట్ర సచివాలయం నుంచి ముఖ్యమంత్రి కార్యాలయ అదనపు కార్యదర్శి భరత్ గుప్తా, కార్యదర్శి ముత్యాలరాజు 'జగనన్న సురక్ష' కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలో తహసీల్దార్, ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్‌ల ఆధ్వర్యంలో అధికారుల బృందాలు ఏర్పాటు చేసి 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని చేపడతామన్నారు. సీఎం వైఎస్ జగన్ ఈనెల 23న 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభించనుండగా, జిల్లాలో అమలుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటామన్నారు. ముందుగానే వలంటీర్లు, సిబ్బంది ఇంటింటికీ తిరిగి కార్యక్రమం గురించి ప్రచారం చేసేలా చూస్తామన్నారు. ప్రజా సమస్యలు సంతృప్తికర స్థాయిలో పరిష్కరించేందుకు అర్హులెవరూ మిగిలి పోకుండా పథకాలను అందించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవాని శంకరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రషీద్‌ఖాన్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ రామాంజనేయులు, నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, డీపీఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి క్రీడా బధిరుల సమాఖ్య సమావేశాలు

అనంతపురం: అనంతపురంలోని అనంత సాయిబాబా కల్యాణ మంటపం వేదికగా ఆది, సోమవారం రాష్ట్ర స్థాయి క్రీడా బధిరుల సమాఖ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షుడు ఎ.లక్ష్మీనరసింహ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా సాధారణ సమావేశంతో పాటు నూతన సంఘం ఎన్నికలు ఉంటాయి. ఎన్నికల పరిశీలకులుగా శాప్ ప్రతినిధులు, ఎన్నికల అధికారులుగా న్యూఢిల్లీకి చెందిన ఆల్ ఇండియా స్పోర్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ది డెఫ్ ప్రతినిధులు హాజరు కానున్నారు.



సత్యసాయిని స్తుతిస్తూ సంగీత కచేరి నిర్వహిస్తున్న భక్తులు

సత్యసాయి మార్గం సదా ఆచరణీయం



కోర్సు పూర్తి చేసిన మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి

ప్రశాంతి నిలయం: ప్రపంచంలో చోటు చేసుకుంటున్న అనేక రుగ్మతలకు విలువలు లోపించడమే కారణమని, ఈ పరిస్థితుల నుంచి బయటపడాలంటే సత్యసాయి బోధనలు, ఆయన చూపిన మార్గమే శరణ్యమని సత్యసాయి విద్యాసంస్థల ప్రొఫెసర్ సుధీర్ భాస్కర్ అన్నారు. సత్యసాయి సెంటర్ ఫర్ హ్యూమన్ వ్యాల్యూస్ ఆధ్వర్యంలో 'ఆధ్యాత్మిక విద్య' ఆన్‌లైన్ కోర్సును పూర్తి చేసిన 66 మందికి శనివారం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విలువలతో కూడిన సమాజ రూపకల్పనే సత్యసాయి లక్ష్యమన్నారు. ఆయన బోధించిన 9 సూత్రాల ఆధారంగా కోర్సును రూపొందించామన్నారు. సత్యసాయి బోధనలను విశ్వవ్యాప్తం చేసేందుకు ప్రతి భక్తుడు కృషి చేయాలన్నారు. అనంతరం భక్తులు సంగీత కచేరి నిర్వహించారు. భక్తిగీతాలు ఆలపిస్తూ భక్తులను మైమరపింపజేశారు.

క్లుప్తంగా

వీరభద్రేశ్వర స్వామి సన్నిధిలో ప్రముఖులు



ఏడు శిరస్సుల నాగేంద్రుని విగ్రహం వద్ద కల్యాణకృష్ణ తదితరులు

లేపాక్షి: లేపాక్షి వీరభద్రేశ్వర స్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆంధ్ర రంజీ క్రికెటర్ కల్యాణకృష్ణతో పాటు హిందూపురం అదనపు జిల్లా సెషన్స్ జడ్జి శ్రీధర్ ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలోని దుర్గాదేవి, వీరభద్రస్వాములకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించారు. ఆలయం విశిష్టతను తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ఫిజికల్ డైరెక్టర్ సురేష్ బాబు, క్రికెట్ అంపైర్ అన్సర్‌ఖాన్, ఆర్డీటీ క్రికెట్ ప్లేయర్ శ్రీకాంత్ ఉన్నారు.

ఏఎస్ఓ ఉద్యోగానికి ఆటోడ్రైవర్ కుమార్తె ఎంపిక



హేమలతకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

ధర్మవరం: ఓ ఆటోడ్రైవర్ కుమార్తె ఏఎస్ఓ (అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్) ఉద్యోగం సాధించింది. పలువురి ప్రశంసలు అందుకుంది. ధర్మవరం పట్టణంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ కట్టా రెడ్డప్ప, శ్యామల దంపతుల కుమార్తె హేమలత ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఏపీపీఎస్సీ పరీక్ష రాసింది. రెండు రోజుల క్రితం విడుదలైన ఫలితాల్లో ఏఎస్ఓగా ఎంపికైంది. విజయవాడలోని డైరెక్టరేట్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగంలో నియమించినట్లు శనివారం ఉన్నతాధికారులు తెలియజేశారు. ఈ సందర్భంగా హేమలతను తల్లిదండ్రులు అభినందించారు. స్వీటు తినిపించి సంతోషం వ్యక్తం చేశారు. హేమలత మాట్లాడుతూ తల్లిదండ్రులతో పాటు భర్త వెంకటేషులు సహకారంతో తాను ఉద్యోగం సాధించానని తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

హిందూపురం అర్బన్: చోరీ కేసులో నిందితుడిని హిందూపురం పోలీసులు అరెస్ట్ చేశారు. అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ కృష్ణారెడ్డి తెలిపిన మేరకు.. హిందూపురం రూరల్ మండల పరిధిలోని కిరికెర శ్రీనగర్ కాలనీలో నివాసం ఉండే పూజారి కుమార్ ఇంట్లో గత నెల 23న చోరీ జరిగింది. ఫోన్‌తో పాటు రూ.96 వేలను దొంగ దోచుకెళ్లాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముద్దిరెడ్డిపల్లికి చెందిన హరీష్‌ని దొంగగా గుర్తించి శనివారం అరెస్టు చేశారు. గ్రామంలోనే అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

నడిపించే దైవం నాన్న



- మారుతున్న కాలానికి మార్గదర్శి

సహనానికి మారుపేరు నాన్న.. భావితరం మార్పుకి మార్గదర్శి. పిల్లల్ని నవమాసాలు మోసేది అమ్మ అయితే.. పుట్టిన తర్వాత తన గుండెలపై మోసేవాడు నాన్న అంటారు పెద్దలు. ఏది కోరినా చిటికెలో తెచ్చిస్తాడు. కుటుంబం కోసం ప్రపంచంతో పోరాడతాడు. తన కోరికలను త్యాగం చేసి పిల్లల శ్రేయస్సు కోసం తపనపడతాడు. అది సాధించే వరకూ విశ్రమించడు. బిడ్డల చేయి పట్టుకుని నడిపించి ప్రయోజకులుగా తీర్చి దిద్దే తండ్రి ప్రాధాన్యతను నవతరానికి తెలియజేసేందుకు చరిత్ర పుటల్లో నాన్నలకూ ఓ ప్రత్యేక రోజును కేటాయించారు. జూన్‌లో వచ్చే మూడో ఆదివారం ప్రపంచ వ్యాప్తంగా ఫాదర్స్ డే జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఫాదర్స్ డే సందర్భంగా నాన్నలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

సందర్భం : నేడు ఫాదర్స్ డే

అనంతపురం/కల్చరల్: తండ్రి మనస్సు వెన్నలాంటిది. ఆయన కోపం వెనుక అచంచలమైన ప్రేమ ఉంటుంది. ఆయన ఉంటే కుటుంబానికి ధైర్యం, భరోసా. బిడ్డల ఉన్నతి కోసం తాను పడ్డ కష్టాన్ని, వదులుకున్న చిన్నపాటి కోరికలను ఏనాడూ ప్రతిఫలంగా ఆశించని నిస్వార్థ వ్యక్తిత్వం నాన్నది. సహనం, ప్రేమ కలిగిన నాన్న.. బిడ్డల చెయ్యి పట్టుకుని ఉజ్వల భవితపై నడిపించే దైవంతో సమానం. అనురాగానికి, ఆప్యాయతలకు ప్రతీకగా ఉండే నాన్నతో గడిపిన క్షణాలు ప్రతి వ్యక్తి జీవితంలో మరచిపోలేని మధురానుభవాలు. పెళ్లయి అత్తారింటికి వెళ్లిన ఆడపిల్లకు తండ్రి లాలన పట్లే మక్కువ ఎక్కువ. ఉద్యోగాలొచ్చి ఎక్కడో స్థిరపడే మగపిల్లలకు సైతం తండ్రి పంచిన క్రమశిక్షణే ముందుకు సాగేలా చేస్తుంది.

మారిన బంధం..

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ నడిచే రోజుల్లో తండ్రి అంటే అత్యంత భయభక్తులుండేవి. ఎదిరించి మాట్లాడడం కాదు కదా.. ఏదైనా కావాల్సింది అడగడానికి కూడా భయపడి తల్లి ద్వారా తమ కోర్కెలు తీర్చుకునేవారు. అయితే కాలక్రమంలో చాలా మార్పులు వచ్చాయి. ఉమ్మడి కుటుంబాలు చెదిరిపోయిన తర్వాత చిన్న కుటుంబాల్లో నాన్న ఓ స్నేహితుడిగా మారిపోయాడు. పిల్లలకు మార్గదర్శిగా ఉంటూనే తల్లి స్థానం ఆక్రమిస్తూ అన్నీ తానై నడిపిస్తున్నాడు. నాన్నంటే ఓ నీడ.. వెన్నంటి ఉండే ఓ రక్షణ వలయం అనే భావాన్ని ఈ తరం పిల్లలు వ్యక్తం చేస్తున్నారు.

నా ఉన్నతికి కారణం నాన్నే



మాది కర్నూలు జిల్లా ఆల్వకొండ. నాన్న పేరు లక్ష్మన్న. కుల వృత్తితో వచ్చే ఆదాయం సరిపడక కూలి పనులకు వెళ్లేవారు. సంతకు వెళితే హోటల్‌లో భోజనానికి కూడా ఖర్చుపెట్టకుండా ఆ డబ్బుతో మాకు అవసరమైనది కొనేవారు. నేను అమెరికాలో ఉద్యోగానికి వెళ్తే మా నాన్న గర్వంగా చెప్పుకునేవారు. ప్రస్తుతం ఎస్కేయూ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నా. ఈ ఉన్నతికి కారణం మా నాన్నే. పదేళ్ల క్రితం ఆయన మా నుంచి శాశ్వతంగా దూరమయ్యారు.

– ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య

ఎక్కడా రాజీ పడేవారు కాదు



మాది ఉరవకొండ మండలం కౌకుంట్ల గ్రామం. నాన్న పేరు ఎర్రిస్వామి.ముగ్గురు అమ్మాయిలు. ఇద్దరు అబ్బాయిల పోషణకు నాన్న పడిన కష్టం ఇప్పటికీ కళ్ల ముందు కదులుతూ ఉంది. మా చదువుల విషయంలో ఎక్కడా ఆయన రాజీ పడేవారు కాదు. ఆ కష్టమే మమ్మల్ని జీవితంలో ఉన్నత స్థానానికి చేర్చింది. నాన్నను తలుచుకుంటే మాకెంతో ధైర్యంగా ఉంటుంది.

– డాక్టర్ మమత, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఈసీఈ, జేఎన్‌టీయూ (ఏ)

నాన్న లేకపోతే నేను లేను



మాది నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట. నాన్న ఎ.నాగ బ్రహ్మేంద్రరావు ప్రోత్సాహం లేనిదే నేను లేను. మేము మొత్తం 8 మంది సంతానం. ముగ్గురు అబ్బాయిలు, ఐదుగురు అమ్మాయిలం. వ్యవసాయాధారిత కుటుంబం. బిడ్డలందరినీ నాన్న సమానంగా చూసేవారు. ఆడపిల్లలకు చదువు ఎందుకంటూ అమ్మ గొడవ చేసేది. నాన్న వినేవారు కాదు. ఎస్కేయూలో ఎమ్మెస్సీలో సీటు వస్తే నాన్నే నన్ను వెళ్లమని ప్రోత్సహించారు. మా ఉన్నతి కోసం ఆయన చాలా త్యాగాలు చేశారు.

– ప్రొఫెసర్ కె.కృష్ణకుమారి, ప్రిన్సిపాల్, ఎస్కేయూ క్యాంపస్ కళాశాల

చదువులు పూర్తయ్యే వరకూ ప్రోత్సహించారు



తల్లిదండ్రులతో డాక్టర్ కె.అనిత

మా నాన్న పేరు వీరన్న. కర్నూలు జిల్లా ఆదోని. మేమిద్దరమూ అమ్మాయిలం. మా నాన్న పోలీసు ఉద్యోగం చేసేవారు. అమ్మాయిలు ఆర్థికంగా, సమాజంలో గౌరవప్రదంగా ఉండాలంటే ఉన్నత చదువులు ఒక్కటే మార్గమని మా నాన్న భావించారు. ఆ దిశగానే మమ్మల్ని చదివించారు. పదో తరగతిలోనే మాకు పెళ్లి సంబంధాలు వచ్చాయి. అయినా నాన్న వాటిని తిరస్కరించి ఉన్నత చదువులు పూర్తయ్యే వరకూ మమ్మల్ని ప్రోత్సహించారు. ఆయన స్ఫూర్తితోనే ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, పీహెచ్‌డీ పూర్తి చేయగలిగాను. కొరియా, తైవాన్‌లో పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్ పూర్తి చేశాను. నా ఎదుగుదలకు కారణమైన నాన్నను ఎన్నటికీ మరువలేను.

– డాక్టర్ కె.అనిత, అసిస్టెంట్ ప్రొఫెసర్, కెమిస్ట్రీ విభాగం, ఎస్కేయూ

దంపతుల దుర్మరణం

- పెన్నహోబిలం సమీపంలో లారీని ఢీకొన్న ద్విచక్రవాహనం
- ఇద్దరు చిన్నారులకూ తీవ్ర గాయాలు



నాగరాజు, స్వాతి (ఫైల్)

ఉరవకొండ: పుట్టింట శుభకార్యాన్ని చూసుకుని సంతోషంగా తిరుగు ప్రయాణమైన దంపతులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురంలోని మారుతీనగర్‌లో నివాసముంటున్న నాగరాజు, స్వాతి దంపతులకు ఐదేళ్ల వయసున్న కుమారుడు హేమంత్, రెండేళ్ల వయసున్న కుమారుడు భాను ప్రసాద్ ఉన్నారు. ఈ నెల 13న తన పుట్టినిల్లైన కణేకల్లులో నిర్వహించిన ఊరి దేవరకు భర్త, పిల్లలతో కలసి స్వాతి హాజరైంది. శనివారం ఉదయం వీరు ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. ద్విచక్ర వాహనాన్ని వేగంగా నడుపుతున్న నాగరాజు.. పెన్నహోబిలం వద్ద వేగాన్ని నియంత్రించుకోలేక ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నాడు. ఘటనలో దంపతులు, పిల్లలు చెల్లాచెదురుగా పడిపోయారు. తలకు తీవ్ర గాయం కావడంతో దంపతులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న వారు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా చిన్నారులను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఉరవకొండ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, విషయం తెలుసుకున్న వెంటనే కణేకల్లు నుంచి స్వాతి కుటుంబసభ్యులు ఆగమేఘాలపై ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి చేరుకుని మృతదేహాలను చూసి బోరున విలపించారు.

మారణాయుధాలతో వీరంగం

- ఇరువర్గాల ఘర్షణలో ఆరుగురికి గాయాలు

బత్తలపల్లి: కళ్లల్లోకి కారం చల్లుతూ మారణాయుధాలతో కొందరు వీరంగం సృష్టించారు. మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. బత్తలపల్లికి చెందిన ఎరుకల వేణు, మారుతినగర్‌కు చెందిన బోయ గోపాల్ ఇరువురూ శుక్రవారం మద్యం సేవించి ఘర్షణ పడ్డారు. ఇది కాస్తా రెండు కులాల మధ్య వివాదానికి దారి తీసింది. పోలీసుల రంగ ప్రవేశంతో పరిస్థితి సద్దుమణిగినా.. తిరిగి అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో ఘర్షణకు దిగారు. కళ్లల్లోకి కారం చల్లుకుంటూ కట్టెలు, మారణాయుధాలతో వీరంగం సృష్టించారు. దాడుల్లో మునీంద్ర, శ్రీనివాసులు, మందల నరసింహులు, రమణ, గణేష్, గవ్వల రమేష్‌కు గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన మునీంద్ర, మందల నరసింహులును కర్నూలు, బెంగళూరు ఆసుపత్రులకు తరలించారు. ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు, బత్తలపల్లి, పోతుకుంట ఎస్ఐలు టీవీ శ్రీహర్ష, ప్రదీప్‌కుమార్‌లు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఎస్సీ కాలనీలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ శనివారం తెలిపారు. శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు.

మృతుడు ధర్మవరంవాసి

ధర్మవరం: రేగాటిపల్లి రైల్వేగేట్ సమీపంలో శుక్రవారం రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి ధర్మవరంవాసిగా గుర్తించినట్లు హిందూపురం రైల్వే పోలీసులు తెలిపారు. పట్టణంలోని పార్థసారథి నగర్‌కు చెందిన చేనేత కార్మికుడు సోమశేఖర్ (36) తాగుడుకు బానిసై అప్పులు చేసి కుటుంబ పోషణ భారమై ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతునికి భార్య నాగమణి, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అనారోగ్యంతో వ్యక్తి బలవన్మరణం



చంద్రశేఖర్ (ఫైల్)

తాడిమర్రి: అనారోగ్యంతో వ్యక్తి బలవన్మరణం పొందిన ఘటన మండలంలోని నార్శింపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కంసలి చంద్రశేఖర్ (44), చంద్రకళ దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. తండ్రి, కుమారుడు కార్పెంటర్ పని చేస్తుండగా, తల్లీకుమార్తెలు వ్యవసాయ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. చంద్రశేఖర్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కిందకు దించి చూడగా అప్పటికే ప్రాణాలు వదిలాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

హిందూపురం అర్బన్: మహిళ ఆత్మహత్యకు యత్నించిన ఘటన పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. స్థానిక హస్నాబాద్‌కు చెందిన రిజ్వాన్ కర్ణాటక మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో శనివారం ఎక్సైజ్ సిబ్బంది వెళ్లి ఇంట్లో తనిఖీలు చేపట్టారు. అక్కడ కొంత మద్యం దొరకడంతో ఆమెను ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌కు రావాలంటూ చెప్పి వచ్చారు. స్టేషన్ వద్దకు వచ్చిన రిజ్వాన్ వాంతులు చేసుకోవడంతో వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ఎక్సైజ్ సీఐ స్వర్ణలత మాట్లాడుతూ రిజ్వాన్ మద్యం అమ్ముతున్నట్లు ఆ ప్రాంత వాసులు ఫిర్యాదు చేయడంతో స్టేషన్‌కు పిలిపించామన్నారు. కేసు నుంచి తప్పించుకునేందుకు అలా ప్రవర్తిస్తోందని పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

హిందూపురం అర్బన్: వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలోని చిన్నమార్కెట్ వద్ద శనివారం చోటుచేసుకుంది. చిన్నమార్కెట్ వద్ద ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికుల ద్వారా రెండో పట్టణ పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు మృతదేహాన్ని హిందూపురం ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలోనే కర్ణాటక రాష్ట్రం మధుగిరి తాలూకా చిక్కనాయకనహళ్లికి చెందిన పలువురు వచ్చి మృతి చెందిన వ్యక్తి విశ్వనాథ్ అని, తమ కుటుంబసభ్యుడే అని తెలిపారు. కొంత కాలంగా క్షయ వ్యాధితో బాధపడుతున్నట్లు పేర్కొన్నారు. వివరాలన్నీ నిర్ధారించుకున్నాక, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

కదిరి టౌన్: గంజాయి తరలిస్తున్న ముగ్గురిని కదిరి పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ ఎస్ఐ వెంకట సుబ్బయ్య తెలిపిన మేరకు.. పట్టణంలోని రాయచోటి రోడ్డు రైల్వే బ్రిడ్జి సమీపంలో కొందరు గంజాయిని తీసుకెళ్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. డీఎస్పీ శ్రీలత, సీఐ మధు ఆదేశాల మేరకు ఎస్ఐ వెంకట సుబ్బయ్య పోలీస్ సిబ్బందితో దాడులు నిర్వహించారు. గంజాయి తీసుకెళ్తున్న పట్టణానికి చెందిన సాతర్ల బాలాజీ, అబూబకర్, సాకే గంగన్నను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి కేజీ గంజాయి, ఒక మోటార్ సైకిల్, ఆటో స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు పంపారు.

షాఫియా ఏమైనట్లు?

- లభ్యం కాని చిన్నారి ఆచూకీ
- కుటుంబసభ్యుల కన్నీరు మున్నీరు



షాఫియా (ఫైల్)

పెనుకొండ: పట్టణంలోని దర్గాపేటకు చెందిన ఖలీల్ కుమార్తె చిన్నారి షాఫియా కనిపించక 6 రోజులవుతున్నా ఇప్పటికీ ఆచూకీ తెలియరాలేదు. స్థానికంగా బాడుగ ఇంట్లో నివసిస్తూ ఓ చిన్న హోటల్‌లో పనిచేయడం ద్వారా వచ్చే కూలీతో ఖలీల్ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నిరుపేదలైన తమ బిడ్డను ఎవరు తీసుకెళ్లారో అంటూ నిత్యం ఆ కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. చిన్నారులతో కలసి ఆడుకుంటున్న షాఫియాను ఎవరైనా కిడ్నాప్ చేశారా? లేక తప్పిపోయిందా అన్నది అంతు బట్టడం లేదు. పట్టణంతోపాటు ఇతర ప్రాంతాల్లో పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించినా ఏ విషయం తెలియరాలేదు. ఓ చిన్నారిని హిందూపురంలో వ్యక్తి ఎత్తుకెళుతున్నట్లు సీసీ ఫుటేజీ ద్వారా తెలుస్తోందనే సమాచారం వినిపిస్తున్నా పోలీసులు ధృవీకరించడం లేదు. దర్గాపేట ప్రాంతానికి తరచూ ఇతర ప్రాంతాల భక్తులు రావడం, యాచకులు పెద్దయెత్తున సంచరించడం పరిపాటి. ఈ నేపథ్యంలో చిన్నారిని కిడ్నాప్ చేశారా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా చిన్నారి అదృశ్యంలో ఎలాంటి పురోగతి లేకపోవడం భయాందోళన రేపుతోంది. తమ పిల్లలను ఇంటి నుంచి బయటకు పంపాలంటే పట్టణప్రజలు జంకుతున్నారు.

గర్భసంచితో పాటు మూత్ర నాళం కత్తిరింపు

- రైల్వే ఆస్పత్రి వైద్యుల నిర్వాకం
- చేతులెత్తేసి కర్నూలుకు రెఫర్ చేసిన వైనం



గుంతకల్లులోని రైల్వే ఆస్పత్రి

గుంతకల్లు: కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడింది అనే చందంగా మారింది గుంతకల్లు రైల్వే ఆస్పత్రి వైద్యుల తీరు. గర్భసంచి తొలగించాలంటూ శస్త్ర చికిత్స చేపట్టిన వైద్యులు.. ఏకంగా రోగి మూత్రనాళాన్నే కత్తిరించి పరిస్థితిని మరింత జఠిలం చేసిన వైనం సంచలనం రేకెత్తించింది. వివరాలు.. గుంతకల్లుకు చెందిన ఓ మహిళ రెండు రోజుల క్రితం రైల్వే ఆస్పత్రిలో చేరింది. పరీక్షించిన వైద్యులు ఆమెకు గర్భసంచి తొలగించాలని సూచించి శుక్రవారం శస్త్రచికిత్స చేశారు. అయితే గర్భసంచి తొలగించే క్రమంలో మూత్ర విసర్జన నాళాన్ని కట్ చేశారు. ఫలితంగా ఆమె పరిస్థితి విషమంగా మారింది. దీంతో చేతులెత్తేసిన వైద్యులు వెంటనే ఆమెను కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఘటనపై రైల్వే ఆస్పత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ గజలక్ష్మీ ప్రభావతి వివరణ కోసం ప్రయత్నించగా ఆమె స్పందించ లేదు. కాగా, గత నెల 8వ తేదీ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న పరిమళ ప్రాణాలు కోల్పోయిన ఘటన మరువకనే మరో దారుణం వెలుగు చూడడంతో రైల్వే ఆస్పత్రికి వెళ్లాలంటే ఉద్యోగులు భయపడుతున్నారు. చిన్నపాటి కుటుంబనియంత్రణ ఆపరేషన్‌ను దాదాపు 8 గంటల పాటు చేసి, చివరకు ఆమె పరిస్థితి విషమం కావడంతో వైద్యులు చేతులెత్తేశారు. దీంతో కుటుంబసభ్యులు హుటాహుటిన అనంతపురానికి తరలిస్తుండగా పరిమళ మృతి చెందింది.

సెమిస్టర్ పరీక్షల్లో విద్యార్థి డిబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ ఐదో సెమిస్టర్ రెగ్యులర్, డిగ్రీ ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షల్లో కాపీయింగ్‌కు పాల్పడిన ఓ విద్యార్థిని డిబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. అనంతపురంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో కాపీయింగ్ చేస్తూ విద్యార్థి పట్టుబడ్డాడన్నారు.

ముగిసిన బదిలీలు

అనంతపురం క్రైం: రెండ్రోజులుగా డీసీహెచ్‌ఎస్‌లో కొనసాగిన సాధారణ బదిలీల ప్రక్రియ శనివారంతో ముగిసింది. 17 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, ఆఫీస్ సబార్డినేట్లకు ఉభయ జిల్లాల డీసీహెచ్‌ఎస్‌లు డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ తిప్పేంద్రనాయక్ బదిలీలు నిర్వహించారు.